# సాక్షి శ్రీకాకుళం

గురువారం • 12 • అక్టోబర్ • 2023





## ఆధార్ సేవలకు కేరాఫ్..

ఆధార్ సేవలకు సచివాలయాలు కేరాఫ్‌గా నిలుస్తున్నాయి. సచివాలయాల్లో ఆధార్ అప్‌డేట్ చేస్తున్నారు. - 8లో



## బాల్య వివాహాలకు అడ్డుకట్ట

సమష్టి కృషితో బాల్య వివాహాలు ఆపాలని అధికారులు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. - 8లో

## ఉప తహసీల్దార్‌పై దాడి కేసులో వ్యక్తికి శిక్ష

వజ్రపుకొత్తూరు: ఉప తహసీల్దార్‌గా పని చేసిన మురళీకృష్ణపై దాడి చేసిన అక్కుపల్లి గ్రామానికి చెందిన పిన్నాసి జంగమయ్యకు బుధవారం సోంపేట కోర్టు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ వై.మధుసూధన్ తెలిపారు. 2020లో మురళీకృష్ణపై దుర్భాషలాడి, దాడి చేసిన ఘటనలో పోలీసులు పక్కా ఆధారాలతో నిరూపించడంతో ముద్దాయికి శిక్ష పడింది. జైలు శిక్ష లేదా రూ.11 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పు ఇవ్వడంతో ముద్దాయి రూ.11 వేలు రుసుం చెల్లించాడు.

## న్యూస్‌రీల్

### 'జగనన్నకు చెబుదాం'కు 62 అర్జీలు

సంతబొమ్మాళి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 62 అర్జీలు వచ్చాయి. మూలపేట పోర్టుకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా రాజపురం రోడ్డు దగ్గర కంకర వేయడం వల్ల వేలాది ఎకరాల వరిపంట ముంపునకు గురవుతుందని జిల్లా కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు కోత మధుసూదనరావు కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌కు ఫిర్యాదు చేశారు. రావివలస రోడ్డుకు మరమ్మతులు చేయాలని, సంతబొమ్మాళి నుంచి హనుమంతు నాయుడుపేట వరకు జంగిల్ క్లియరెన్స్ చేయాలని కోరుతూ ఫిర్యాదులు అందాయి. 11 ఎల్.కోటపాడు వంశధార సైఫన్ మరమ్మతులు చేపట్టాలని అధికారులను కోరారు. మేఘవరం వంశధార కాలువకు మరమ్మతులు చేపట్టి నీరు తక్షణం అందించాలని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నవీన్, సబ్ కలెక్టర్ నూరల్‌కమార్, తహసీల్దార్ చలమయ్య, ఎంపీడీఓ ప్రేమలీల, ఎంపీపీ రాజేశ్వరి, జెడ్పీటీసీ వసంతరెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### వైభవంగా శ్రీకూర్మనాథునికి తులసీ దళార్చన



తులసీదళార్చన చేస్తున్న అర్చకులు

గార: శ్రీకూర్మనాథునికి వైభవంగా బుధవారం తులసీ దళార్చన నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు తులసీ దళార్చన నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను వేంచింపజేసి ప్రత్యేక పూజల అనంతరం తులసీదళాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామన్నసింహాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు దాసుబాబు, శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, లక్ష్మణాచార్యులు, శ్రీమన్నారాయణ, మురళీకృష్ణమాచార్యులు తదితరులు ఈ అర్చనలో పాల్గొన్నారు. ముందుగా వేదమంత్రోచ్ఛరణ, మంగళ వాయిద్యాల నడుమ మాడవీధుల్లో తులసీ దళాలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో ఈఓ జి.గురునాథం, నర్సుబాబు తదితరులు పాల్గొన్నారు.

### 1141 బిందెల నీళ్లతో అభిషేకం



జలాభిషేకానికి బిందెలతో నీళ్లు తీసుకువెళ్తున్న మహిళలు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామంలో వర్షాల కోసం ఉమాచంద్రశేఖర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర ఘట జలాభిషేకాలు నిర్వహించారు. 1141 బిందెల నీళ్లతో శివ లింగానికి అభిషేకం చేశారు. వర్షాలు పడి, పంటలు పండాలని మహిళలు, రైతులు మొక్కుకున్నారు.

### 'జైలులో ఉన్న వారి కేసులు పరిష్కరించాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జైలులో ఉన్న వారి కేసులు త్వరగా పరిష్కరించాలని, అందుకు గాను పోలీసు యంత్రాంగం శ్రద్ధ చూపించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. ఆయన బుధవారం కోర్టులోని కాన్ఫరెన్స్ హాల్‌లో అండర్ ట్రయల్ రివ్యూ కమిటీ మీటింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ జైలులో ఉన్న ముద్దాయిల కేసులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీదేవి, భాస్కరరావు, ఫణికుమార్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు, అడిషనల్ సూపరింటెంట్ ఆఫ్ పోలీస్ పోలీస్ తిప్పేస్వామి, డిస్ట్రిక్ట్ రెవెన్యూ ఆఫీసర్ ఎం.గణపతి పాల్గొన్నారు.

### వంశధార ఆర్‌ఎంసీపై వంతెనలకు నిధులు మంజూరు

శ్రీకాకుళం పీఎన్ కాలనీ: బీఆర్ వంశధార కుడి ప్రధాన కాలువపై డబుల్ లైన్ వంతెనల నిర్మాణానికి రూ.3.05 కోట్లు నిధులు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్‌ఎంసీ 44.100 కిలోమీటర్స్ గూడెం గ్రామం వద్ద, 48 కిలోమీటర్ మునసబుపేట వద్ద డబుల్ లైన్‌వంతెనల నిర్మాణానికి నిధులను కేటాయించారు. గూడెం వద్ద వంతెనకు రూ.1.64 కోట్లు, మునసబుపేట వద్ద వంతెనకు రూ.1.41 కోట్లు కేటాయించారు.



### నమ్మలేకున్నాం..



మాది ఒడిశా రాష్ట్రం. పదిహేనేళ్ల కిందట ఇక్కడకు వలస వచ్చాం. ఇళ్లలో పనులు చేస్తూ ఇద్దరు పిల్లలతో బతుకు ఈడుస్తున్నాను.నా భర్త కూడా చనిపోయారు. తిరిగి స్వస్థలానికి వెళ్లలేక ఇక్కడే పూరి పాకలు, అద్దె కొంపల్లో కాలం వెళ్లదీస్తున్నాను. ఈ సమయంలో జగనన్న మా పాలిట దేవుడయ్యారు. ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టారు. నా పిల్లలతో నివసిస్తున్నాను. ఇది ఇప్పటికీ నమ్మలేకున్నాను.

– బెహరా పుష్ప, లింగాలవలస, చల్లవానిపేట జగనన్న కాలనీ

### పేదల పాలిట దేవుడు



జగనన్న మా లాంటి పేదలు పాలిట దేవుడు. అర్హత ఉంటే చాలు ప్రభుత్వ పథకాలు ఇంటికి తెచ్చి మరీ అందిస్తున్నారు. ఎంతో మార్పు చూస్తున్నాం. చంద్రబాబు ప్రభుత్వంలో వారి కార్యకర్తలకు మాత్రమే ఏవైనా పథకాలు వర్తించేవి. జగనన్న హయాంలో మాలాంటి దిక్కులేని వాళ్లకు అన్నీ ఇస్తున్నారు. నాకు సొంతిల్లు ఇచ్చి నీడ కల్పించారు.

– తిర్లంగి లక్ష్మి, లింగాలవలస, చల్లవానిపేట జగనన్న కాలనీ

పై చిత్రం.. జలుమూరు మండలం లింగాలవలస, చల్లవానిపేటలో నిర్మించిన జగనన్న కాలనీ. ఈ కాలనీలో 116 ఇళ్లు మంజూరు చేస్తే దాదాపు పూర్తయ్యాయి. ఈ ఒక్క కాలనీలో రూ.58కోట్ల మేర ప్రభుత్వం ఖర్చు చేసింది. విద్యుద్దీకరణకు రూ.2.11 కోట్లు, రూ.18.90 లక్షలతో ప్రతి ఇంటి ముందు సురక్షితమైన ఫిల్టర్ తాగునీరు అందించే ట్యాప్‌లు, కాలనీ ప్రధాన వీధిలో రూ.35 లక్షలతో బీటీ రోడ్డు, వాటికి అనుసంధానం చేసేందుకు లింక్ రోడ్లు నిర్మించింది. భూగర్భ జలాల సంరక్షణ కోసం ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంతలు, ఆహ్లాదకరంగా ఉండేందుకు రూ.5 లక్షలతో రోడ్డుకు ఇరువైపులా నీడనిచ్చే మొక్కలు ఏర్పాటు చేసింది. రూ.5.3లక్షలతో సింహద్వారం నిర్మాణం చేపట్టింది. కాలనీ వాసులు సేద తీరేందుకు, పిల్లలు ఆటలకు ప్లే గ్రౌండ్, పార్కు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఇప్పుడీ మోడల్ కాలనీ సీఎం వైఎస్ జగన్ చేతుల మీదుగా గురువారం వర్చువల్‌గా ప్రారంభమవుతుంది.

# జగనన్న ఇళ్లు.. ఆనందాల లోగిళ్లు


- సకల సౌకర్యాలతో సర్వాంగ సుందరంగా తయారవుతున్న లేఅవుట్ కాలనీలు
- జిల్లాలో 834 లేఅవుట్లలో కాలనీల నిర్మాణం
- మోడల్ కాలనీగా లింగాలవలస, చల్లవానిపేట
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

అక్షరాలా ఎనిమిది వందల ముప్పై నాలుగు ప్రాంతాలు. సెంటు, సెంటున్నర స్థలాల్లో అందమైన ఇళ్లు. కాలనీలే అనుకుంటే ఏకంగా ఊళ్లకు ఊళ్లే పురుడు పోసుకుంటున్నాయి. జగనన్న ఇళ్లు ఇప్పుడు ఆనందాల లోగిళ్లలా కనిపిస్తున్నాయి. అర్హత గల ప్రతి పేదవాడికి ఇల్లు నిర్మించాలన్న దృఢ సంకల్పంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జిల్లాలో కాలనీలే కాదు ఏకంగా ఊళ్లు నిర్మిస్తున్నారు. అన్ని సౌకర్యాలతో కాలనీలను నిర్మించి నివాసయోగ్యంగా తీర్చిదిద్దుతున్నారు.

**సకాలంలో సాయం**

సకాలంలో ఇసుక, సిమెంట్‌తో పాటు ఆర్థిక సాయాన్ని అందిస్తుండటంతో ఇళ్ల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇవ్వడమే కాకుండా పక్కా గృహాలను మంజూరు చేసింది. ఇంటి నిర్మాణానికి మూడు విడతల్లో రూ.లక్షా 80వేలను ఇస్తోంది. డబ్బులు లేని లబ్ధిదారులకు వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా రూ.35వేలు రుణం ఇప్పిస్తోంది. ఇంటి నిర్మాణానికి అవసరమైన మెటీరియల్‌ను రాయితీపై అందజేస్తోంది. అంతేకాకుండా కాలనీల్లో విద్యుత్, రోడ్లు, మంచినీరు తదితర మౌలిక సదుపాయాలను కల్పిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇంటి నిర్మాణాలు చేపడుతున్నారు.



పలాస రామకృష్ణాపురంలో 2300 ఇళ్లతో నిర్మితమైన జగనన్న కాలనీ



వజ్రపుకొత్తూరు మండలం బెండిగేటు వద్ద నిర్మితమవుతున్న జగనన్న కాలనీ

**పేదల కోసం..**

- జిల్లాలో అర్హులైన వారందరికీ ఇళ్ల స్థలాల కోసం 1795.80 ఎకరాలు అవసరం కాగా 1227.17 ఎకరాల ప్రభుత్వ భూమిని సేకరించగా, మిగతా 568.63 ఎకరాల మేరకు ప్రైవేటు భూమి కొనుగోలు చేశారు.
- ఒక్క భూమి కొనుగోలు కోసమే రూ.178.31కోట్లు వెచ్చించారు.
- అర్హులైన వారందరి కోసం ఉమ్మడి జిల్లాలో 1156 లేఅవుట్లు వేశారు.
- లేఅవుట్ కోసం భూములు చదును చేయడం, జంగిల్ క్లియరెన్స్, అంతర్గత రోడ్లు, హద్దుల రాళ్లు, డ్రైనేజీ తదితర వాటి కోసం రూ. 30కోట్లు ఖర్చు పెట్టింది.
- జగనన్న హౌసింగ్ కాలనీల్లో తాగునీటి సౌకర్యం కోసం 1632 పనులకు గాను రూ. 143.05 కోట్లు మేర ఖర్చు చేస్తున్నారు.
- ఇందులో ఇప్పటికే 653 పనులు పూర్తయ్యాయి. 247 ప్రగతి దశలో ఉన్నాయి. లేఅవుట్లలో విద్యుత్ సౌకర్యం కోసం రూ.10కోట్లకు పైగా ఖర్చు పెడుతున్నారు.
- 801 లేఅవుట్లలో 50,100 ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ చేసే లక్ష్యంలో భాగంగా 269 లేఅవుట్లలో 25,126 ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ పూర్తయింది. మరో 472లేఅవుట్లలో 37,807ప్లాట్లకు ఎలక్ట్రిఫికేషన్ చేయనున్నారు. 51 లేఅవుట్లలో 3524 ప్లాట్ల ఎలక్ట్రిఫికేషన్ ప్రస్తుతం జరుగుతోంది.
- వేసిన లేఅవుట్లలో పచ్చదనం కోసం కోట్ల రూపాయాల ఖర్చుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

### సుందరంగా తీర్చిదిద్దుతున్నాం

ఇటు ప్రజాప్రతినిధులు, అటు ప్రభుత్వ పెద్దల పూర్తిస్థాయి సహకారంతో లింగాలవలస, చల్లవానిపేట కాలనీని జిల్లాకే మోడల్ కాలనీగా తీర్చిదిద్దుతున్నాము. దీన్ని మోడల్‌గా తీసుకుని తీసుకొని జిల్లాలో అన్ని జగనన్న కాలనీలను సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. లబ్ధిదారులు సంతోషంగా ఇళ్లు నిర్మించుకుంటున్నారు. కాలనీల్లో అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. – నక్క గణపతి, ప్రాజెక్టు డైరెక్టర్, గృహ నిర్మాణ సంస్థ

### అందరికీ ఇళ్లు..



రాష్ట్ర వ్యాప్తంగా అర్హత కలిగిన పేదవారికి సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్థలం పట్టాతో పాటు ఇళ్లు మంజూరు చేసి వారి పాలిట దేవుడిలా మారారు. నా నరసన్నపేట నియోజకవర్గం పరిధిలో ఇల్లు లేని పేదవారు ఉండకూడదు. స్థలం లేకపోతే ప్రభుత్వ స్థలం ఇస్తున్నాం. నిజంగా పేద వాడి సొంతింటి కల నెరవేరుతోంది. ఇది నిరంతర ప్రక్రియగా సాగుతోంది. విశాల ప్రయోజనంతో రూపాయి లంచం లేకుండా అర్హులకు ఇళ్లు ఇవ్వడం చాలా ఆనందంగా ఉంది. మళ్లీ సీఎంగా జగనన్న కావాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

– ధర్మాన కృష్ణదాస్, మాజీ డిప్యూటీ సీఎం

**శరవేగంగా పనులు**

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 1156 లే అవుట్‌లు వేశారు. జిల్లాలో 834 అవుట్లలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతగా తీసుకుంది. వీటిలో 38,773 స్థలాల్లో నిర్మాణాలు చేపట్టేందుకు మంజూరు ఇచ్చింది. 37,067 ఇళ్లకు సంబంధించి ఆన్‌లైన్ జరిగింది. వీటితో పాటు సొంత స్థలం ఉన్న వారి కోసం మరో 35,128 ఇళ్లు మంజూరు చేశారు. దీంతో లబ్ధిదారులు ఉత్సాహంగా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. జగనన్న కాలనీల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. నిర్మాణాలు పూర్తయిన చోట గృహ ప్రవేశాలు జరుగుతున్నాయి. భవన నిర్మాణ కార్మికులకు చేతి నిండా పని దొరుకుతోంది. ఇళ్ల నిర్మాణ సామగ్రి క్రయ, విక్రయాలతో మార్కెట్‌లో టర్నోవర్ భారీగా పెరిగింది. జిల్లాలో ఇప్పటికే అటు కాలనీల్లోనూ, ఇటు సొంత స్థలం ఉన్న చోట 30వేల ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి.



శ్రీకాకుళం రూరల్‌లోని రాగోలులో 2230 ఇళ్లతో తయారవుతున్న జగనన్న కాలనీ



ఇచ్ఛాపురం మున్సిపాల్టీలో 2865ఇళ్లతో నిర్మితమవుతున్న జగనన్న కాలనీ



టెక్కలి జగతిమెట్ట వద్ద 378 ఇళ్లతో జగనన్న కాలనీ

# కొలువు పేరిట కుచ్చుటోపీ

- 104లో జిల్లా మేనేజరు పోస్టు ఇప్పిస్తానని మోసం
- ఇద్దరి వద్ద రూ. 6.10 లక్షలు వసూలు చేసిన ఘనుడు
- నిందితుడు పశ్చిమగోదావరి జిల్లా వాసి




శ్రీకాకుళం క్రైమ్ : కొలువు పేరిట ఇద్దరికి కుచ్చుటోపీ పెట్టాడో ఘనుడు. 104లో జిల్లా మేనేజరు పోస్టు ఇప్పిస్తానని చెప్పగానే జిల్లాకు చెందిన ఇద్దరు రూ.6.10లక్షలు సమర్పించేశారు. ఆ డబ్బుతో మోసగాడు టోపీ పెట్టడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణరావు, బాధితులు చెప్పిన వివరాల ప్రకారం.. పశ్చిమగోదావరి జిల్లా గోపాలపురం మండలం కరకరాలగూడెం గ్రామానికి చెందిన కొయ్యా మణిస్వరూప్ తాను హైదరాబాద్‌లో 104 అంబులెన్సు హెచ్‌ఆర్ విభాగంలో పనిచేస్తున్నానని నగరంలోని కృష్ణాపార్కు తురాయి చెట్టువీధికి చెందిన బొండాడ దుర్గారావుకు ఏడాది కిందట ఓ మధ్యవర్తి ద్వారా పరిచయమయ్యారు. 104 అంబులెన్స్ సర్వీసులో ఆమదాలవలస, సింగుపురం సెంటర్లలో జాబ్ ఇప్పిస్తానని చెప్పి ముందుగా రూ. 2 లక్షలు గత సంవత్సరం తన భార్య స్వప్న అకౌంట్‌లో వేయించుకున్నాడు. అయితే ఇచ్ఛాపురంలో దుర్గారావుకు ఒక పోస్టు రావడంతో కొన్నాళ్లు చేసి మానేశాడు. ఇదే విషయంపై మణిస్వరూప్‌ను నిలదీయగా ఈ ఏడాది మార్చిలో దుర్గారావుకు ఫోన్ చేసి 104లో జిల్లా మేనేజర్ పోస్టు ఖాళీగా ఉందని చెప్పాడు. దీంతో దుర్గారావు రూరల్ మండలం పాత్రునివలస గ్రామానికి చెందిన తన మిత్రుడు బుడ్డి గౌరీశ్వరరావుకు విషయం చెప్పి ఏప్రిల్‌లో మణిస్వరూప్‌ను జిల్లాలోనే పరిచయం చేశాడు. రూ. 4.30 లక్షలకు పోస్టు మాట్లాడుకుని రూ. 4.10లక్షలకు ఓకే అయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో రూ. 25 వేలు, రూ. 25 వేలు, రూ. 1 లక్ష, రూ. 50 వేలు దఫదఫాలుగా గౌరీశ్వరరావు తన అన్న గణేష్ అకౌంటు నుంచి దుర్గారావుకు వేయగా దుర్గారావు నిందితుడు మణిస్వరూప్‌కు అదే అమౌంటు వేశాడు. కొన్నాళ్ల తర్వాత జాబ్ కోసం గౌరీశ్వరరావు మణిస్వరూప్‌ను నిలదీయగా.. అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇస్తాను హైదరాబాద్ రండి అని చెప్పడంతో జూలైలో అక్కడ కలిశాడు. గౌరీశ్వరరావు చేతిలో ఫేక్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ పెట్టి రెండుసార్లు రూ. 2లక్షలు అదే పద్ధతిలో అకౌంట్‌లో వేయించుకున్నాడు. జిల్లాకు వచ్చి సంబంధిత 104 విభాగానికి వెళ్లి అపాయింట్‌మెంట్ ఆర్డర్ చూపించగా ఇది ఫేక్ అని అక్కడి వారు చెప్పడంతో నిర్ఘాంతపోయారు. దీంతో దుర్గారావు రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేశామని ఎస్‌ఐ లక్ష్మణరావు తెలిపారు.

### నేటి మధ్యాహ్నం వరకు అభ్యంతరాల స్వీకరణ

శ్రీకాకుళం న్యూకాలనీ: సహిత విద్య (భవిత) కేంద్రాల్లో ఖాళీగా ఉన్న రిసోర్స్ పర్సన్ల పోస్టు భర్తీలో భాగంగా రాష్ట్ర అధికారులు వెల్లడించిన మెరిట్ లిస్టుపై అభ్యంతరాల స్వీకరణకు గురువారం మధ్యాహ్నం ఒంటి గంట వరకు గడువు పెంచినట్లు సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ ఏపీసీ డాక్టర్ రోణంకి జయప్రకాష్ తెలిపారు. వీఐ/హెచ్‌ఐ, ఎంఆర్ పోస్టులకు సంబంధించి మెరిట్ లిస్టును ఇప్పటికే డీఈఓ శ్రీకాకుళం అధికారిక వెబ్‌పోర్టల్‌లో ఉంచినట్లు వెల్లడించారు. మెరిట్ లిస్టుపై బుధవారం అభ్యంతరాలు స్వీకరించామని, 12వ తేదీ మధ్యాహ్నం వరకు అభ్యంతరాలను సమగ్రశిక్ష జిల్లా కార్యాలయానికి వచ్చి లిఖితపూర్వకంగా తెలియజేయాలని చెప్పారు.

# కిడ్నీ రీసెర్చ్ సెంటర్ పరిశీలన



పలాస కిడ్నీ ఆస్పత్రి వద్ద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

కాశీబుగ్గ: పలాసలో రాష్ట్ర ప్రభుత్వం రూ.50 కోట్లతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ బుధవారం సందర్శించారు. ఈ నెలలోనే సీఎం వైఎస్ జగన్ ఆస్పత్రి ప్రారంభానికి విచ్చేయనున్నారని, ఈ సందర్భంగా నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతం చేయాలన్నారు. కిడ్నీ రీసెర్చ్ సెంటర్, 200 పడకల ఆస్పత్రిలో వివిధ గదులను సందర్శించి అక్కడి పనులు పరిశీలించారు. ఆస్పత్రి పనులు పూర్తయినా అక్కడకు చేరుకునేందుకు కావాల్సిన రోడ్డు పనులు పూర్తి కాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్‌ను పిలిపించి మాట్లాడారు. పాతజాతీయ రహదారి నుంచి ఆస్పత్రి వరకు నిర్మిస్తున్న మున్సిపాలిటీ రోడ్డును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. అన్ని పనులు పూర్తయ్యాక మరోసారి పరిశీలనకు వస్తానన్నారు. కార్యక్రమంలో పలాస రెవెన్యూ డివిజన్ అధికారి సీతారామమూర్తి, ఏపీఎంఎస్‌ఐడీసీ ఈఈ సత్యప్రభాకర్, తహసీల్దార్ లంబాల మధుసూదనరావు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నత అధికారులు, ఆస్పత్రికి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

# పోర్టు రోడ్డు నిర్వాసిత రైతులకు పరిహారం ఫైనల్



పోర్టు రోడ్డు నిర్వాసిత రైతులతో మాట్లాడుతున్న జేసీ నవీన్‌కుమార్, సబ్ కలెక్టర్ నూరుల్ కమార్

టెక్కలి: మూలపేట గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణంలో భాగంగా టెక్కలి మీదుగా అప్రోచ్ రోడ్డుకు సంబంధించి గుర్తించిన భూముల నిర్వాసిత రైతులకు పరిహారాన్ని ఫైనల్ చేసినట్లు జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌కుమార్ వెల్లడించారు. టెక్కలి మండలం మోదుగువలస, బన్నువాడ, వేములవాడ గ్రామాల నిర్వాసిత రైతులతో బుధవారం టెక్కలిలో సబ్ కలెక్టర్ నూరుల్ కమార్ నేతృత్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఈ మూడు గ్రామాలకు సంబంధించి ఇప్పటికే స్థానికంగా, జిల్లా కేంద్రంలో పలుదఫాలుగా సమావేశాలు నిర్వహించామని గుర్తు చేశారు. చివరగా మోదుగువలస గ్రామానికి చెందిన రైతులకు ఎకరాకు రూ. 36 లక్షలు, బన్నువాడకు రూ. 35 లక్షలు, వేములవాడ రైతులకు రూ.34 లక్షలు ఫైనల్ చేశామని దీనికి సంబంధించి ఆయా రైతులు అంగీకారం తెలిపారని, గురువారం నుంచి సర్వే పనులు సైతం పనులు ప్రారంభిస్తామని జేసీ స్పష్టం చేశారు. అయితే అందరికీ సమానంగా రూ.36 లక్షలు పరిహారం వచ్చే విధంగా చూడాలని రైతులు విజ్ఞప్తి చేయగా, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తామని జేసీ పేర్కొన్నారు. అలాగే అప్రోచ్ రోడ్డు ప్రభావిత గ్రామాల్లో రూ.50 లక్షలతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

## క్లుప్తంగా

### 'సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు పోరాటం'

శ్రీకాకుళం పాతబస్టాండ్: వీఓఏల సమస్యలు పరిష్కారమయ్యేంత వరకు పోరాడాలని వీఓఏల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సి.హెచ్.అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎస్‌వీ రమణ పిలుపునిచ్చారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు యానిమేటర్స్ వీఓఏలు శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయం వద్ద బుధవారం 36 గంటల ధర్నా మొదలుపెట్టారు. అంతకుముందు జ్యోతిబా పూలే పార్కు నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అనంతరం కలెక్టరేట్‌లోకి వెళ్లడానికి ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని 250 మందిని అరెస్టు చేసి ఒకటో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడిచిపెట్టారు.

### కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కింపు



కొత్తమ్మ తల్లి హుండీ ఆదాయం లెక్కిస్తున్న దృశ్యం

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి అమ్మవారి హుండీ ఆదాయం లెక్కింపు బుధవారం నిర్వహించారు. శ్రీకాకుళం దేవదాయ శాఖాధికారి బీవీజీఎస్ రవికుమార్ పరిశీలనలో గత 62 రోజులకుగాను ఆదాయం లెక్కించగా.. రూ.3,51,520లు వచ్చిందని ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి పాల్గొన్నారు.

### ఇంటర్ త్రైమాసిక పరీక్షలు ప్రారంభం



ఓ ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో క్వార్టర్లీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్మీడియెట్ విద్యార్థుల త్రైమాసిక(క్వార్టర్లీ) పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 168 జూనియర్ కళాశాలల్లో ఈ పరీక్షలు మొదలయ్యాయి. తొలిరోజు తెలుగు/సంస్కృతం/హిందీ సబ్జెక్టులకు పరీక్షలు జరిగాయి. ఆయా సబ్జెక్టుల్లో ఒకే ప్రశ్న పత్రంతో విద్యార్థులు పరీక్ష రాశారు. ఉదయం 9.30 నుంచి 12.30 వరకు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు, మధ్యాహ్నం 1.30 నుంచి 4.30 వరకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పరీక్షలను నిర్వహించారు. 49490 మంది విద్యార్థులకు గాను 45వేల మంది వరకు ఈ పరీక్షలు రాసినట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఇంటర్మీడియెట్ విద్య డీవీఈఓ కోట ప్రకాశరావు, ఆర్‌ఐఓ పి.దుర్గారావు తదితరులు పర్యవేక్షిస్తున్నారు.

### 'ఆర్థిక స్వావలంబనే లక్ష్యం'



కొండచీపుర్ల ఉత్పత్తిని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్

సంతబొమ్మాళి: స్వయం సహాయక సంఘ సభ్యులకు చేయూత అందించి ఆర్థిక స్వావలంబన చేయడమే లక్ష్యమని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు డాక్టర్ డి.విద్యాసాగర్ అన్నారు. మండలంలోని నౌపడ పంచాయతీ సీతానగరంలో బుధవారం కొండచీపుర్లు ఉత్పత్తిదారులను సందర్శించి సభ్యులతో మాట్లాడారు. అవసరమైన పెట్టుబడిని ప్రభుత్వ కార్యక్రమాలు, గ్రామ సంఘం ద్వారా అందించేందుకు వైఎస్‌ఆర్ కాంత్రి పథకం సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. అప్పులు సకాలంలో తీరిస్తే ఎప్పుడు కావాలంటే అప్పుడు పెట్టుబడి అందిస్తారని అన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఏరియా కో ఆర్డినేటర్ ఎస్.శ్రీరాములు, ఏపీఎం టి.సూర్యనారాయణ, సీసీ ధనలక్ష్మి, వీఓఏ టి.సుధారాణి, ఎంపీటీసీ సభ్యులు సుధాకర్ పాల్గొన్నారు.

# ఆధార్ సేవలు c/o సచివాలయం



పురుషోత్తపురం గ్రామ సచివాలయంలో ప్రత్యేక ఆధార్ క్యాంప్‌లో సిబ్బంది

- 'ఆధార్'లోని చిరునామాలో చేర్పులు, మార్పులకు అవకాశం
- వేలిముద్రలు, ఫోన్ నంబర్ల అనుసంధానం
- కార్డు పొంది పదేళ్లయితే అప్‌డేట్ తప్పనిసరి
- డిసెంబర్ 14 వరకు గడువు
- జిల్లాలో 146 కేంద్రాల్లో శాశ్వత ఆధార్ కేంద్రాలు ఏర్పాటు

ఆమదాలవలస రూరల్: ఆధార్ సేవలకు ఇప్పుడు సచివాలయాలు కొత్త చిరునామాగా మారాయి. ప్రభుత్వం నుంచి పొందే అన్ని రకాల సంక్షేమ పథకాలతో పాటు ఇతర లావాదేవీలకు ఆధార్ తప్పనిసరిగా మారింది. 2010–16 మధ్య కాలంలో సరైన ధ్రువీకరణ పత్రాలు లేకున్నా ఆధార్ కార్డుల జారీ ప్రక్రియ చేపట్టారు. ఈ కారణంగా బోగస్ కార్డులు సృష్టించి పథకాలు కాజేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తున్నాయి. అలాంటి తప్పిదాలను సరిచేసేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అడుగులు వేశాయి. ఆధార్‌కార్డు పొందిన ప్రతి ఒక్కరూ సరైన ధ్రువీకరణ పత్రాలు జత చేసి, అప్‌డేట్ చేసుకునేలా ఉత్తర్వులు జారీ చేశాయి. లేకపోతే డిసెంబర్ తర్వాత కార్డును నిలిపివేస్తామని కూడా చెప్పాయి.

**జిల్లాలో ప్రత్యేక ఆధార్ కేంద్రాలు**

ప్రజా సంక్షేమం దృష్ట్యా గ్రామ, వార్డు సచివాలయాల్లో ఇప్పటికే 600కు పైగా పౌర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఆధార్ కేంద్రాలను గ్రామాల్లో నెలకొల్పే చర్యలు చేపట్టింది. గత టీడీపీ హయాంలో మండలానికి ఒకటి లేదా నియోజకవర్గానికి రెండు మాత్రమే ఆధార్ కేంద్రాలు ఉండేవి. ఈ కారణంగా చిన్న మార్పులకు కూడా ప్రజలు వేల రూపాయలు ముడుపులు చెల్లించి రోజుల తరబడి చెప్పులరిగేలా తిరగాల్సి వచ్చేది. ప్రస్తుతం అలాంటి ఇబ్బందులను రూపుమాపేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రజల ముంగిటే ఆధార్ సేవలు అందించేలా శ్రీకారం చుట్టారు.

జిల్లాలో 835 గ్రామ సచివాలయాలు, 95 వార్డు సచివాలయాలు ఉన్నాయి. వీటిలో శాశ్వతంగా 146 ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో ప్రజలందరికీ ఆధార్ ప్రత్యేక కేంద్రాలు అందుబాటులోకి వచ్చాయి. లక్షల్లో ప్రజలు తమ కార్డులను అప్‌డేట్ చేసుకున్నారు. ఇంకా గ్రామాల్లో అప్‌డేట్ చేసుకోని వాళ్లు ఉంటే వారి కోసం ప్రత్యేక ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నారు. ఆధార్ అప్‌డేట్ మార్పుల కోసం డిసెంబర్ 14వ తేదీ వరకు గడువు ఉంది.

**అప్‌డేట్ కోసం ఇలా..**

- 2010–16 మధ్య ఆధార్ తీసుకుని ఆ తర్వాత ఆధార్‌లో పేరు, చిరునామా, మార్చుకోని వారు తప్పనిసరిగా కార్డును అప్‌డేట్ చేసుకోవాలి.
- 2016 తర్వాత ఫొటో, జనన తేదీని మార్చుకున్నప్పటికీ చిరునామాను మార్చుకోని వారు డాక్యుమెంట్ అప్‌డేట్ చేసుకోవాలి. లేదంటే కార్డు ఉన్నా డిసెంబర్ తరువాత పనిచేయదు.
- ఆధార్ సస్పెండ్ అయితే ఆధార్ లింక్ అయిన మొత్తం సేవలన్నీ నిలిచిపోతాయి. బ్యాంకింగ్, పోస్టల్, గ్యాస్ తదితర సర్వీసులు ఆగిపోతాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అందుతున్న అన్నీ సేవలు రద్దవుతాయి.
- ఆధార్ కార్డులో ఉన్న చిరునామా, ప్రస్తుత చిరునామా వేరుగా ఉంటే సరైన ఆధారాలతో చిరునామా అప్‌డేట్ చేయించుకోవాలి.
- వివాహానికి ముందు ఆధార్‌లో మహిళలకు వివాహం తర్వాత భర్త ఇంటి పేరుతో ఆధార్ తీసుకోవాలంటే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేసిన మ్యారేజ్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

### సొంత ఊరిలోనే ఆధార్ సేవలు



ఊరిలోనే ఆధార్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చింది. ఆధార్‌కార్డులో ఏ చిన్న మార్పులు చేసుకోవాలన్నా మీ–సేవ కేంద్రాల చుట్టూ గతంలో తిరగాల్సి వచ్చేది. సిఫార్సులు, లంచాలకు తావులేకుండా ప్రస్తుతం సేవలు అందిస్తున్నారు. ప్రతి గ్రామంలోనూ ఆధార్ సేవలు వినియోగంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం నెలలో మూడు లేదా ఐదు రోజులు ప్రత్యేక కేంద్రాలను కూడా ఏర్పాటు చేస్తోంది. ప్రజలందరూ ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి. – ఎస్.వాసుదేవరావు, ఎంపీడీఓ, ఆమదాలవలస మండలం

# యుద్ధ ప్రాతిపదికన సైఫన్ నిర్మాణం

- నారాయణపురం కుడికాలువకు నీరు విడుదల



నిర్మాణం పూర్తి చేసుకున్న సైఫన్ గోడ

సంతకవిటి: ఇటీవల కురిసిన వర్షాలతో వరద తాకిడికి షాలిపేట వద్ద నారాయణపురం కుడికాలువపై ఉన్న సైఫన్ గోడ కూలిపోయిన సంగతి తెలిసిందే. వరి చేలు పొట్టదశలో ఉండడం, సాగునీటికి ఇబ్బందులు తలెత్తడంతో అధికారులు, పాలకులు వెంటనే స్పందించారు. మండల పరిషత్ నుంచి లక్షరూపాయలు విడుదల చేశారు. సైఫన్ గోడ నిర్మాణాన్ని యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేశారు. కుడికాలువలోకి బుధవారం నీటిని విడుదల చేశారు. కుడికాలువ ద్వారా సంతకవిటి, పొందూరు, ఆమదాలవలస, ఎచ్చెర్ల, శ్రీకాకుళం మండలంలోని 18,320 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోంది. జెడ్పీ వైస్‌చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు చొరవతో గోడ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేసినట్టు జేఈ ఎం.మురళీకృష్ణ తెలిపారు.

# ప్రజారోగ్య సంరక్షణకు శ్రీకారం

శ్రీకాకుళం రూరల్:

గతంలో ఏ ప్రభుత్వమూ చేయని విధంగా వైఎస్సార్ సీపీ ప్రజల ఆరోగ్య సంరక్షణకు శ్రీకారం చుట్టిందని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్ స్టాంప్స్ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మండల పరిధిలోని కిష్టప్పపేటలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి వైద్యులు అందిస్తున్న చికిత్సలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు.

వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి రోగుల వివరాలను సేకరించి సంబంధిత వైద్యుడికి అందించాలన్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధ పడే వారికి ప్రతి 15రోజులకు ఓసారి మందులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి నిర్మల, జిల్లా పంచాయతీ రాజ్ విభాగపు అధ్యక్షుడు అంబటి శ్రీనువాసరావు, జెడ్పీటీసీ రుప్ప దివ్య, మండల పార్టీ అధ్యక్షుడు చిట్టి జనార్దన రావు, పార్టీ నాయకులు బాణ నర్సింగరావు, గుండ హరేష్, గుండ ఢిల్లీరావు, బాణ శ్రీను, గంగు నరేంద్రకుమార్, బగ్గు అప్పారావు, గుండ మోహన్, భగవాన్ దాస్ పాల్గొన్నారు.



పోషకాహార కిట్‌లను అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

# 'వినతులను నిశితంగా పరిశీలిద్దాం'



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణపతిరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాజకీయ పార్టీల వినతులు, ఫిర్యాదులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ అధికారి వారి కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల నాయకులతో బుధవారం సాయంత్రం 13వ వారపు సమావేశం నిర్వహించారు. పలు రాజకీయ పార్టీల ఫిర్యాదులు, ఎన్నికల సామగ్రి మొదటి దశ పరిశీలన, ఇంటింటి ఓటర్ల సర్వే తదితర అంశాలపై ఆయన మాట్లాడుతూ ఇంటింటి సర్వేని క్రాస్ వెరిఫికేషన్ చేయాలన్నారు. ఎన్నికల కోసం జిల్లాకు కేటాయించిన బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్స్, వీవీ ప్యాట్స్ వచ్చాయని, ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ (ఎఫ్‌ఎల్‌సీ) అక్టోబర్ 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు చేపట్టనున్నామని అన్నారు. ఇందుకు గాను ఆయా పార్టీల జిల్లా అధ్యక్షులు లేఖ ద్వారా ధ్రువీకరించిన వారిని మాత్రమే అనుమతిస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు రౌతు శంకర రావు, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పీఎంజే బాబు, భారతీయ జనతా పార్టీ నుంచి ఇప్పిలి సీతా రాజు, బీఎస్పీ నుంచి ఎల్.సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### కల్వర్టును ఢీకొన్న లారీ

టెక్కలి రూరల్: మాకవరం గ్రామ సమీప జాతీయ రహదారిపై బుధవారం వేకువ జామున లారీ కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్‌లు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పలాస నుంచి రాజమండ్రి వైపు కూల్ డ్రింక్స్ లోడుతో వెళ్తున్న లారీ బుధవారం వేకువజామున టెక్కలి సమీప మాకవరం గ్రామం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. ప్రమాదంలో బండి ముందు భాగం నుజ్జునుజ్జు అయిపోయింది.

### వరి కోతలు మొదలు



యంత్రాలతో వరికోత చేపడుతున్న దృశ్యం

సారవకోట: మండలంలోని బుడితి జంక్షన్ సమీపంలో వరి కోతలు అప్పుడే ప్రారంభమయ్యాయి. వంశధార కాలువకు పక్కనే ఉన్న పంట పొలాల్లో వరినాట్లు త్వరగా ప్రారంభించారు. పంట త్వరగా చేతికి రావడంతో ప్రస్తుతం జగనన్న యంత్రా సేవా పథకం ద్వారా అందించిన యంత్రాలను వినియోగించి వరి పంట కోత చేపడుతున్నారు.

# వివాహిత ఆత్మహత్య



మృతురాలు అనురాధ (ఫైల్)

ఎచ్చెర్ల క్యాంపస్: భర్త వేధింపులు తాళలేక ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. అయితే ఆ ఆత్మహత్యను సాధారణ మరణంగా చిత్రీకరించేందుకు అనేక ప్రయత్నాలు జరిగాయి. దీనిపై బుధవారం ఎచ్చెర్ల పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు..

బొబ్బిలి సమీపంలోని పక్కి ప్రాంతానికి చెందిన డర్రు అనురాధ (25)కు పార్వతీపురం సమీపంలో నందివానివలస ప్రాంతానికి చెందిన కుప్పిలి బాబాజీతో ఏడేళ్ల కిందట వివాహమైంది. వీరు ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టులో కొత్తూరు డివిజనల్‌లో రిసోర్సు పర్సన్లుగా పనిచేస్తున్నారు. ఎచ్చెర్ల మండలం కుశాలపురం ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. భార్యాభర్తల మధ్య మనస్పర్ధలు తలెత్తడంతో అనురాధ ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయారు. కుటుంబ సభ్యులు సర్ది చెప్పి మళ్లీ కాపురానికి పంపించారు. ఈ నేపథ్యంలో మంగళవారం మళ్లీ భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. దీంతో భర్త ఇంటిలో లేని సమయం చూసి ఆమె పురుగుల మందు తాగేశారు. బాబాజీ ఇంటికి వచ్చి చూసే సరికి ఆమె అపస్మారక స్థితిలో ఉండడంతో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతుండగానే.. తన భార్య అస్వస్థతకు గురైందని, పార్వతీపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకువస్తున్నానని బాబాజీ అనురాధ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆ ఆస్పత్రికి వద్దకు చేరుకున్నారు. అంబులెన్స్ నుంచి దించే సరికి అనురాధ మృతి చెంది ఉంది. దీంతో వారికి అనుమానం వచ్చి బాబాజీని ప్రశ్నించగా.. దారిలో చనిపోయిందని చెప్పాడు. ఈ ఘటన కుశాలపురంలో జరగటం వల్ల ఈ లిమిట్స్‌కు చెందిన పోలీస్ స్టేషన్‌లో మృతురాలి తల్లి సూరమ్మ, అన్న శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు. పార్వతీపురం ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం పోస్టుమార్టం నిర్వహించనున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. అనంతరం ఆ ఫిర్యాదు మేరకు సమగ్ర దర్యాప్తు చేస్తామన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులు మాత్రం భర్త వేధింపుల వల్లనే ఆమె చనిపోయిందని ఆరోపిస్తున్నారు.

# శ్రీకూర్మంలో కేంద్ర బృందం పరిశీలన



సమావేశంలో వివరాలను సేకరిస్తున్న కేంద్ర బృందం సభ్యులు

గార: శ్రీకూర్మం పంచాయతీని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలకులు ఈశ్వరన్ నంబూద్రి, సభ్యులు బుధవారం సందర్శించారు. మౌలిక సదుపాయాలు, పరిపాలన, వసతులు, పంచాయతీ ఆర్థిక సమీకరణ వంటి విషయాలపై ఆరా తీశారు. సచివాలయ సిబ్బంది విధులు, బాధ్యతలు, ప్రజలకు అందిస్తున్న సేవలతో పాటు వలంటీర్ల సేవలను అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ గోరు అనిత, వార్డు మెంబర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలించారు. తడి, పొడి చెత్త సేకరణ, న్యాడెప్ పిట్లు నుంచి వర్మీ కంపోస్టు తయారీ విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీఓ గోపీబాల, డీపీఆర్‌సీ రాజు, ఎంపీడీఓ సంజీవ రమణయ్య, ఈఓపీఆర్‌డీ బి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి చెట్టు శంకరరావు, అందవరపు బాలకృష్ణమూర్తి, ఊట అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**సంతబొమ్మాళిలో..**

సంతబొమ్మాళి: కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ బృందం సంతబొమ్మాళి పంచాయతీని బుధవారం పరిశీలించింది. మౌలిక సదుపాయాలు, వసతులు, గ్రామ పంచాయతీ ఆర్థిక సమీకరణ ప్రత్యేక్షంగా వీక్షించారు. గ్రామ సచివాలయంలో సచివాలయం సిబ్బంది, విధులు, బాధ్యతలు, ప్రజలకు అందిస్తున్న సేవలు, గ్రామ వలంటీర్ల విధులు, బాధ్యతలు ప్రజలకు అందిస్తున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. బీఆర్ అంబేడ్కర్, మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# ఉత్తమ బోధనతోనే లక్ష్యాల సాధన



పాతపట్నం గురుకులంలో ఉపాధ్యాయుల రికార్డులను పరిశీలిస్తున్న ఏపీ సోషల్ వెల్ఫేర్ జిల్లా సమన్వయాధికారి బాలాజీ నాయక్

పాతపట్నం: విద్యార్థులు లక్ష్యాలు సాధించేందుకు అధ్యాపకులు శ్రమించాలని ఆంధ్రప్రదేశ్ సోషల్ వెల్ఫేర్ జిల్లా సమన్వయాధికారి బాలాజీ నాయక్ అన్నారు. పాతపట్నం ప్రహరాజపాలేంలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో జిల్లా అకడమిక్ ఆడిట్ టీమ్‌తో బుధవారం ఉపాధ్యాయుల విద్యా బోధన తీరు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన తరగతి గదిలో విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించి, విద్యార్థులకు సంతృప్తి పరిచే విధంగా బోధన ఉండాలన్నారు. ఉపాధ్యాయులను పనితీరు, రికార్డు వర్కులను పరిశీలించారు. కార్యక్రమంలో దుప్పలవలస, కొల్లివలస గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్స్ డి.దేవేంద్ర, ఎన్.రామకృష్ణలు, కె.రామమూర్తి, ప్రిన్సిపాల్ ఆర్.వి.కృష్ణతార, వైస్ ప్రిన్సిపాల్ వి.అర్చన,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సెంచూరియన్ ఆధ్వర్యంలో 'కృషిమేళా'



కృషిమేళాలో పాల్గొన్న వర్సిటీ విద్యార్థులు, రైతులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా రాయగడ సమితి గండాహతి గ్రామంలో సెంచూరియన్ వర్సిటీ ఎంఎస్ స్వామినాథన్ వ్యవసాయ విద్యాలయం సిబ్బంది, విద్యార్థులు, రైతులతో 'కృషిమేళా' కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. దీనిలో భాగంగా సుమారు 200 మంది రైతులకు ప్రకృతి వ్యవసాయం, మట్టి పరీక్షలు, కీటకాల నిర్మూలనతో అధిక దిగుబడులపై వివరించారు. ఈ సందర్భంగా ఎస్పీ నందా మాట్లాడుతూ.. విద్యార్థులు గ్రామాల అభివృద్ధి కోసం అభ్యసించడం గొప్ప విషయమని కొనియాడారు. కార్యక్రమంలో సెంచూరియన్ వెటర్నరీ స్కూల్ డీన్ డాక్టర్ ఆర్.కె.స్వయిం, డాక్టర్ ఆశీర్వచన్ మహాపాత్రో, డాక్టర్ బిశ్వజిత్ సాహు, డాక్టర్ కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

# మనోవేదనతో వివాహిత అదృశ్యం

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలోని డీసీసీబీ కాలనీకి చెందిన ఓ వివాహిత జూలైలో అదృశ్యమైనట్లు తన భర్త బుధవారం ఫిర్యాదు చేశారని రెండో పట్టణ ఎస్‌ఐ నాగిరెడ్డి లక్ష్మణ రావు పేర్కొన్నారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల మేరకు.. నరసన్నపేట ఎండోమెంట్ విభాగంలో జూనియర్ అసిస్టెంటుగా పనిచేస్తున్న ముద్దాడ శ్రావణి, తన భర్త దిబ్బా సురేష్‌తో కలిసి డీసీసీబీ కాలనీలో ఉంటున్నారు. వీరికి వివాహమై పిల్లలు లేరు. దీంతో ఆమె నిరంతరం మనోవేదనకు గురవుతూ ఉండేవారు. ఉద్యోగంలో సైతం ఒత్తిడికి గురయ్యేవారు. ఇదే క్రమంలో ఓ సారి ఎవరికీ చెప్పకుండా ఇంటిని వదిలిపెట్టి వెళ్లిపోయి మళ్లీ తిరిగి వచ్చారు. వచ్చాక కూడా ఇంటిలో ముభావంగానే ఉండేవారు. ఈ క్రమంలో జూలై 25న ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిందని, మళ్లీ తిరిగి రాలేదని, ఎంత గాలించినా లాభం లేకపోవడంతో బుధవారం రాత్రి ఆమె భర్త దిబ్బా సురేష్ రెండో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. ఎస్‌ఐ కె.లక్ష్మి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

**చికెన్**

**బ్రాయిలర్**

| లైవ్ | డ్రెస్‌డ్ | స్కిన్‌లెస్ |
|---|---|---|
| ₹140 | ₹235 | ₹ 255 |


**సాక్షి క్లాసిఫైడ్స్**

**WANTED**

■LIFE RAY హాస్పిటల్, న్యూబిడ్జి రోడ్ సింహద్వారం దరి, శ్రీకాకుళంలో పనిచేయుటకు కంప్యూటర్ నాలెడ్జ్ & బిల్లింగ్ అనుభవం ఉన్న రిసెప్షనిస్ట్, OT అసిస్టెంట్స్ కావలెను. సెల్: 6301260891 [S-771130]

■ హైదరాబాదులో ఆప్తా ఎల్డర్‌కేర్‌లో ఉద్యోగ అవకాశం. M/F కేర్ టేకర్స్ కావలెను. జీతం: 16–20వేలు, వయస్సు: 21–45, భోజన వసతి ఇన్సూరెన్స్ కలవు. సంప్ర:: 6300813664 [G-1140]

■ ఫార్మ్-డి ఇంటర్న్‌షిప్ డ్యూటి డాక్టర్స్, MPHW కంప్లీట్ ఐనవారికి అప్రెంటిస్‌షిప్ నర్సెస్ కొత్తవారికి ప్రాధాన్యత ఉచిత వసతి, అహల్య నర్సింగ్ హోమ్, శివాలయం వెనుక, కొత్తపేట, గుంటూరు. 9246427459 [G-1150]

■మా ఆఫీసు న్యూ ఫ్రాంచేజీ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్ టైమ్ గా వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. సంప్ర:: 72077 76136. [M-1221771]

■ విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డోర్స్ డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

■ కన్సల్టెన్సీ కాదు. VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి M/F ఆయా, నర్సులు, వంట చేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 13,000/- - 35000/- ఫ్రీ రూమ్ + భోజనం. HYD Ph: 8919613984 [HA-707]

■ వైజాగ్‌లోని ప్రముఖ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో వృద్ధులకు 24 గంటలు సేవ చేయుటకు M/F కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. ఫోన్: 99899 93756 [V- 850]

**గమనిక**

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ లిం.**
(రాష్ట్ర ప్రభుత్వ సంస్థ)
జిల్లా కార్యాలయం:: శ్రీకాకుళం

ధాన్యం తరలించు వాహనములకు GPS పరికరముల కొరకు
**షార్ట్ టెండరు నోటీసు**

Lr. No.: Mktg./Paddy Proc./KMS 2023-24. తేదీ:11.10.2023

ఈ క్రింది షెడ్యూల్ ప్రకారము విక్రేతలు / సరఫరాదారుల నుండి టెండర్లు ఆహ్వానించడమైనది.

| వ. సం. | వివరములు | టెండరు సమర్పించుటకు ఆఖరు తేది / సమయం | టెండర్లు ఓపెన్ చేయు తేది / సమయం |
|---|---|---|---|
| 1 | ధాన్యం తరలించు వాహనములకు సుమారు 5000 GPS పరికరములు సరఫరా చేయుట. (specifications at Annexure-A) | By 05:00 PM on 18th October 2023 | Technical Bid : At 3:00 PM & Financial Bid : At 4.30 PM On 19th October 2023 |

RBK వద్ద ఫార్మ్‌గేట్ / PPC నుండి జిల్లాలోని రైస్ మిల్లులకు ధాన్యం రవాణా చేసే వాహనాలను ట్రాక్ చేయడం కోసం ధాన్యం రవాణా వాహనాలకు GPS పరికరాలను సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్‌ను ఆహ్వానించడమైనది. ఆసక్తి గల వారు District Manager, APSCSCL, Srikakulam వారి పేరున రూ.5000/- (అయిదు వేలు రూపాయలు మాత్రమే) టెండర్ ఫీజు DD- డిమాండు డ్రాఫ్టును శ్రీకాకుళం బ్రాంచ్‌లో చెల్లుబాటగు విధముగా చెల్లించి, తే 12-10-2023 ది నుండి తే 18-10-2023 ది వరకు పని దినములలో / పని వేళలయందు టెండర్ ఫారంను పొందవచ్చును. వివరణాత్మక టెండర్ డాక్యుమెంట్, నిబంధనలు మరియు షరతులను శ్రీకాకుళం జిల్లా వెబ్‌సైట్ నుండి నోటీసుల ట్యాబ్ కింద టెండర్ల విభాగం నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. https://srikakulam.ap.gov.in/

సం/- యం.నవీన్, సంయుక్త కలెక్టర్ & EOED,
APSCSCL, శ్రీకాకుళం


# సమష్టి కృషితో బాల్య వివాహాలకు అడ్డుకట్ట

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం
- ఘనంగా అంతర్జాతీయ బాలికా దినోత్సవం





మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం

శ్రీకాకుళం అర్బన్: అధికారులంతా సమష్టిగా పనిచేస్తే బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్(ఏపీఎస్సీపీ సీఆర్)సభ్యులు గొండు సీతారాం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్, శ్రీకాకుళం నగర పాలక సంస్థ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా బుధవారం నగరంలోని బాపూ జీ కళామందిర్‌లో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్య వివాహాలు అరికట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై ప్రజా మున్సిపల్ ఉన్నతాధికారులు, సచివాలయాల మహిళా సంరక్షణ, సంక్షేమ కార్యదర్శులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బందికి అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన గొండు సీతారాం మాట్లాడుతూ రాష్ట్రంలో బాల్య వివాహాల నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు తీసుకుందన్నారు. దీనిలో భాగంగా వార్డు, గ్రామ, మండల స్థాయి ప్రజా ప్రతినిధులకు ఈ చట్టంపై పూర్తి అవగాహన కల్పించారు. బాల్య వివాహాల్లో పాల్గొనకుండా, అలాగే ప్రభుత్వ అధికారులు, సిబ్బందిపైన ఒత్తిడి పెంచకుండా రాష్ట్రంలోని అన్ని జాతీయ, ప్రాంతీయ పార్టీల అధ్యక్షులకు ఇప్పటికే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ లేఖలు రాసినట్టు వివరించారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకొని వివాహ ఆహ్వాన పత్రిక అందించే బంధువుల నుంచి వధువు వయస్సు 18 ఏళ్లు పూర్తయిందా, వరుడి వయస్సు 21 ఏళ్లు అయిందా అనే ఆధారిత సమాచారం ఉంటేనే గానీ పెళ్లికి హాజరు కాలేమన్న సందేశం సమాజంలో విస్తరించాలని పిలుపునిచ్చారు. ప్రతి బాల్య వివాహానికి పోలీసు శాఖ ఎఫ్‌ఐఆర్ నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఐసీడీఎస్ పీడీ బి.శాంతి శ్రీ మాట్లాడుతూ బాల్యవివాహ రహిత శ్రీకాకుళం జిల్లాగా తీర్చిదిద్దేందుకు అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నట్టు చెప్పారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ యు.శ్రీలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ వివాహాలు జరిగినా తమ కమిటీ అధికారులను జాగృత పరుస్తున్నట్టు చెప్పారు. ఇలాంటి బాల్య వివాహాలు ఎవరిదృష్టికి వచ్చినా 1098 చైల్డ్‌లైన్ కు సమాచారం అందించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు అదనపు ఎస్పీ తిప్పేస్వామి, నగరపాలక కమిషనర్ చల్లా ఓబులేషు, నగర పాలక సంస్థ స్పెషల్ గ్రేడ్ కమిషనర్ ప్రసన్న, జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు, తదితరులు మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్మూలించేందుకు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. అంతకుముందు కైలాస్ సత్యార్థి ఫౌండేషన్ రూపొందించిన బాల్య వివాహాల నిర్మూలన పుస్తకాలను అతిథులు, అధికారులు ఆవిష్కరించారు. అనంతరం బాల్య వివాహాలకు దూరంగా ఉందామన్న ప్రతిజ్ఞ చేయించారు.

కార్యక్రమంలో జిల్లా ఆర్‌ఐఓ పి.దుర్గారావు, జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకటరమణ, మెప్మా పీడీ కిరణ్, జిల్లా పంచాయతీ అధికారి రవికుమార్, దేవదాయ శాఖ ఈఓ గురునాథం, స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ పీవీ సాయి శ్రీనివాస్, సమగ్రశిక్ష జీసీడీఓ నీరజ, సబ్‌రిజిస్టర్ సంధ్య కళ్యాణి, వివిధ శాఖల అధికారులు, వార్డుల సచివాలయాల కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.